క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

మీర్‌పేట: పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అవసరాల నిమిత్తం అప్పటి కమిషనర్ ఆరు నెలల క్రితం 34 మందిని కాంట్రాక్ట్ పేరుతో విధుల్లోకి చేర్చుకొని ఇప్పటివరకు వేతనాలు ఇవ్వకపోడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆరునెలల వేతనాలు చెల్లించడంతో పాటు పాత కార్మికుల వలె పర్మినెంట్ చేసి అర్హత కలిగిన వారిని వివిధ కేటగిరీలలో ప్రమోషన్లు కల్పించాలన్నారు. దీంతో పాటు 60 సంవత్సరాలు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు దాసరి బాబు, నాయకులు సీహెచ్. యాదగిరి, భారతమ్మ, బోడ నర్సింహ, గిరి, ఆంజనేయులు, నర్సింహ పాల్గొన్నారు.

భక్తులు పోలీసులకు సహకరించాలి



సీఐ శంకర్‌నాయక్

మీర్‌పేట: గణేశ్ నిమజ్జన శోభాయాత్రలు నిర్వహించే భక్తులు పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. శోభాయాత్రలో డీజేలు, లౌడ్ స్పీకర్లను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మార్గమధ్యలో ఎక్కడైనా వైర్లు కిందికి వేలాడుతూ ఉన్నట్లయితే ఇనుప, తడిగా ఉన్న వస్తువులతో తొలగించే ప్రయత్నం చేయొద్దని, విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఊరేగింపులో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వలంటీర్లను పెట్టుకోవాలని, ఊరేగింపు సమయంలో చిన్నపిల్లలు వాహనాల కిందికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నిమజ్జనం చేసే సమయంలో పిల్లలను చెరువుల వద్దకు రానివ్వొద్దని, జేబు దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీసు, ఇతర శాఖల వారికి భక్తులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వాణి



మాట్లాడుతున్న కమిషనర్ వాణి

తుక్కుగూడ: వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. గురువారం పుర కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె అధికారులతో నిమజ్జనంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిమజ్జనం కోసం తుక్కుగూడ సూరం చెరువు, రావిర్యాల పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం భారీ క్రేన్లను అందుబాటులో ఉంచామన్నారు. చెరువు వద్ద లైటింగ్, మంచి నీటి వసతి, తదితర ఏర్పాట్లు చేశామన్నారు. నిమజ్జనం సందర్భంగా శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్ సిబ్బంది తగ్గు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కొందుర్గు: మండలంలోని తంగెళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, చెర్కుపల్లి, గంగన్నగూడ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ నాయకులు గురువారం షాద్‌నగర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు బస్సుల రాకపోకలు నిలిపివేయడంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, రవి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. బేబీపాండ్స్ నిరుపయోగం

వృథాగా తాత్కాలిక కొలను
- రూ.15 లక్షలతో ఏర్పాటు
- ఇప్పటి వరకు 300 విగ్రహాలు నిమజ్జనం
- అవగాహన కల్పించడంలో విఫలం



సరూర్‌నగర్ మైదానంలో ఏర్పాటు చేసిన బేబీపాండ్

హుడాకాంప్లెక్స్: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని చిన్న విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక కొలను(బేబీపాండ్స్) వృథాగా మారింది. పెద్ద చెరువుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) విగ్రహాల వలన కలిగిన కాలుష్యాన్ని తగ్గించడానికి, పర్యావరణ పరిరక్షణకు జీహెచ్‌ఎంసీ నిధులు రూ.15 లక్షలతో తీర్చిదిద్దిన పాండ్స్.. అధికారుల నిర్లక్ష్యానికి నిరుపయోగంగా మిగిలింది. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడం వలనే.. ఇందుకు నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు.

ఇంటి సమీపంలో సదుపాయం

చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులు పార్కులు, ఇతర బహిరంగ ప్రదేశాల్లోనే కాకుండా ఇంట్లో చిన్నచిన్న విగ్రహాలు ప్రతిష్ఠిస్తుంటారు. వీరి కోసం జీహెచ్‌ఎంసీ.. సరూర్‌నగర్ మండల కార్యాలయ మైదానంలో జీహెచ్‌ఎంసీ నిధులతో ఈ బేబీపాండ్స్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ చిన్న పెద్ద అన్నీ కలిపి 45 వేల విగ్రహాల వరకు ఉంటాయి. పెద్ద విగ్రహాలను సరూర్‌నగర్ ట్యాంక్‌లో నిమజ్జనం చేస్తారు. చిన్నవాటి కోసం తాత్కాలిక కొలను ఏర్పాటు చేశారు. కానీ దీనిపై అవగాహన లేని మెజార్టీ భక్తజనం.. వినియోగించుకోలేక పోతున్నారు. ఇంటికి సమీపంలోనే ఈ సౌలభ్యం ఉన్నప్పటికీ.. విషయం తెలియక సుదూర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను వెతుక్కుంటూ వెళ్తున్నారు. దీని వలన దూర భారంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు.

నిమజ్జనం ఖర్చు రూ.1500

ఇంట్లో ఏర్పాటు చేసుకునే విగ్రహం ధర రూ.250 నుంచి రూ.300 మించదు. కానీ జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన ఈ పాండ్స్ ఖర్చు రూ.15 లక్షలు అంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ఇప్పటి వరకు ఈ పాండ్స్‌లో 300 విగ్రహాల వరకు నిమజ్జనం చేసినట్లు అంచనా. ఈ లెక్కన ఒక్కో విగ్రహం నిమజ్జనానికి జీహెచ్‌ఎంసీ రూ.1500 వరకు ఖర్చు చేయడాన్ని పరిశీలిస్తే అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



బేబీపాండ్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అధికారుల విఫలం

మున్సిపాలిటీ అధికారులకు పన్ను వసూలుపై ఉన్న శ్రద్ధ.. మౌలిక సదుపాయాల కల్పనలో లేదు. చవితి ఉత్సవాల నేపథ్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బేబీపాండ్స్.. కాంట్రాక్టర్ల కోసమే అన్నట్లుగా మారింది. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. అందుకే అది నిరుపయోగంగా మిగిలింది. ప్రజాధనం వృథా అయింది.

– అంజన్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మురళీనగర్‌లో ఆయన ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూలీలకు పని దినాలు తగ్గించారని, సమయానికి డబ్బులు అందడంలేదని ఆరోపించారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. 200ల రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం నాయకులు రాంపురం యాదయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

అయ్యప్ప పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బడంగ్‌పేట్: అక్టోబర్ 18 నుంచి ప్రారంభమయ్యే అయ్యప్ప మహా పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి దేవాలయం కర్మాన్‌ఘాట్‌లో గురుస్వాములు సద్ది సందీప్‌రెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అంకాల రమేశ్‌రెడ్డి, సునీల్‌కుమార్, మోహన్, శివారెడ్డి, అనంతయ్య, సురేశ్ తదితర గురుస్వాములు విచ్చేసి ఆవిష్కరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గురుస్వాములు

శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధనం యోగా



మాట్లాడుతున్న డీసీపీ వెంకటరమణ

ఎల్‌బీనగర్: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్–2025 పోటీలు గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి డీసీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై యోగాసన పోటీల్లో విజేతలకు సర్టిఫికేట్స్, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా అనేది ప్రాచీనంగా ఉందని, మన సనాతన ధర్మంలో యోగా అనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధన అన్నారు. యోగా శరీరం, మనస్సును, ఆత్మను ఏకం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి, డిస్ట్రిక్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, జగదీష్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఎన్‌రెడ్డి, రవికుమార్, మంజుల, నర్సింహాగౌడ్, మనోహర్‌కుమార్ పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణకు బియ్యం అందజేత

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయానికి హాజరయ్యే భక్తులకు అన్నప్రసాద వితరణకు స్థానికుడు తాళ్ల మహేందర్ తాను నిర్వహిస్తున్న మండల పూజ ముగింపు సందర్భంగా 26 క్వింటాళ్ల బియ్యం, రూ. 2 లక్షల నగదును గురువారం ఆలయ ఈఓ లావణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మహేందర్‌ను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, సభ్యులు తోకటి కిరణ్, సంతోష్‌కుమార్, ఎనుముల రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఆలయ అర్చకులు అంబా ప్రసాద్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, సంతోష్‌శర్మ, సిబ్బంది వెంకటయ్య, రమాదేవి పాల్గొన్నారు.



తాళ్ల మహేందర్‌ను సన్మానిస్తున్న ఈఓ లావణ్య

ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలి

చంచల్‌గూడ: బాగున్న రోడ్లపై రోడ్లు వేసే అధికారులు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను బాగు చేయడంలో విఫలమవుతున్నారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని గురువారం ఆయన కుర్మగూడ డివిజన్ పర్యటించి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లన్నీ కంకర తేలి గుంతలమయంగా మారాయన్నారు. జీహెచ్‌ఎంసీ తాత్కాలికంగా గుంతలు మూయడంతో భారీ వర్షాలకు రోడ్ల దుస్థితి మొదటికొచ్చిందన్నారు. కేవలం ప్రధాన రోడ్లలో డంబర్ రోడ్లు వేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, యుగేందర్, వరుణ్ పాల్గొన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న సహదేవ్‌యాదవ్

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

షాద్‌నగర్: పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఉన్న కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్వేపల్లి రా ధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, మెమెంటోలు అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

నందిగామ: నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిలో ఉన్న బ్రిడ్జిపై నుంచి వరద నీరు వెళ్తే..రాకపోకలు నిలిచిపోతున్నాయని, దీంతో ఆయా గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారనే విషయమై సాక్షిలో ప్రచురితమైన వరుస కథనాలపై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి హెచ్‌ఎండీఏ నిధులు రూ.70 లక్షల ను మంజూరు చేయించారు. ఈ మేరకు ప్రొసీడింగ్(నం.250810/హెచ్‌ఎండీఏ) జారీ చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు గురువారం ఎమ్మెల్యే వెల్లడించారు.

చైన్ స్నాచర్ల రిమాండ్

నాగోలు: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్ జానీ వివరాల ప్రకారం..రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం, తిప్పాపూర్ గ్రామానికి చెందిన ముత్త బీరయ్య అలియాస్ అనిల్ (32) ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం, అంకిరెడ్డిపల్లికి చెందిన కమల శ్రీధర్(32) దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు క్యాబ్ డ్రైవర్లు కావడంతో పరిచయం ఏర్పడింది. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 1న గౌరెల్లి గ్రామంలో జూపల్లి వీరమ్మ మీసేవలో ఆధార్ అప్‌డేట్ చేసుకొని ఇంటికి వెళ్తుండగా పల్సర్ బైక్‌పై వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ద్విచక్ర వాహనం నంబర్ గుర్తించి ఇద్దరిని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్సైలు శివనాగ ప్రసాద్, డీఎస్సై నర్సింహ, రమేష్, దశరథ్, ఏఎస్సై రవియాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న మక్బూల్ జానీ

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- ఎంఈఓ అంగూర్‌నాయక్

కొత్తూరు: విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు మంచి గుర్తింపు వస్తుందని ఎంఈఓ అంగూర్‌నాయక్ అన్నారు. మండలంలోని పెంజర్లలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు లక్ష్మికి గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ లక్ష్మి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఆమె శేష జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘుపతిరెడ్డి, కృష్ణ, దామోదర్‌రెడ్డి, రఘుపాల్, ప్రిన్స్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండలంలోని టేకులపల్లి, ఉత్తరాసిపల్లి, గంగన్నగూడ, తంగెళ్లపల్లి గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న వంతెన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రవాణా సౌకర్యం మెరుగుపడితే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహార్నిషలు కృషి చేస్తున్నారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఈ ప్రాంతం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని గుర్తుచేశారు.

గురుకుల పాఠశాలకు ఫ్యాన్‌ల బహూకరణ

కొందుర్గు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ. 4 లక్షల విలువైన ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి భవిష్యత్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి,నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, వజ్రమ్మ,రామయ్యగౌడ్, సత్యనారాయణరెడ్డి,కృష్ణ, నరేందర్, రవీందర్, మల్లేశ్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, మంగులాల్‌నాయక్,చంద్రశేఖర్,కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

నందిగామ: తాను చదువుకున్న పాఠశాలను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, అందుకు పూర్వ విద్యార్థులతో పాటు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అధ్యక్షతన పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. పాఠశాలలను బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి జూనియర్ కళాశాలగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక కమిటీని పార్టీలకతీతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలకు ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బడంగ్‌పేట్: శ్రీహిల్స్‌కాలనీ గణనాథుడిని దర్శించుకున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



తుక్కుగూడ: రావిర్యాలలో గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్

ఘనంగా బొజ్జగణపయ్యకు పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మహేశ్వరం నియోజకవర్గ పరిధి ప్రాంతాల్లో వాడవాడలా కొలువుదీరిన బొజ్జగణపయ్యలకు గురువారం భక్తులు విశేష పూజలు చేశారు. స్వామివారికి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల నిమజ్జనోత్సవం చేశారు. ఊరేగింపుగా, ఆటపాటలతో పార్వతీ పుత్రుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. నిమజ్జనాన్నిపురస్కరించుకొని స్వామివారి చేతిలోని లడ్డూను వేలంలో కైవసం చేసుకోవడానికి భక్తులు పోటీపడ్డారు.

– సాక్షి, నెట్‌వర్క్



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పంజాల అనిల్‌కుమార్ కాలనీలో లడ్డూను కైవసం చేసుకున్న కోటేశ్వరరావు దంపతులను సన్మానించిన సినీ నటుడు సుమన్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా



కందుకూరు: దెబ్బడగూడలో రూ.2.10 లక్షలకు లడ్డూను దక్కించుకున్న భక్తుడు శ్రీనివాస్‌రెడ్డి



కందుకూరు: కొత్తగూడలో.. నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడు